దీపావళి కథల పోటీలో రూ. 200/- కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!

# వరదహస్తం

పూజారి గవరయ్యకి ఆ రాత్రంతా కంటిమీద కునుకులేదు. అసహనంగా పక్కమీద అటూ ఇటూ దొర్లుతూ గడిపాడు. భార్య, కొడుకు ఎంత నచ్చచెప్పినా జరిగినది మంచేనని ఎందుకో అతడి మనసు నమ్మలేకపోతోంది.

కళ్ళుమూసినా తెరిచినా గైరమ్మతల్లి విగ్రహమే కళ్ళముందు ప్రత్యక్షం అవుతోంది. అదీ ఒకలా కాదు రెండు రకాలుగా. ఒకసారి ఒక్కచేత్తో, మరోసారి రెండు చేతుల్తో, రెండు చేతులతో ఉన్న గైరమ్మతల్లిని చూడడం గవరయ్యకి చాలా ఇబ్బందిగా ఉంది. ముఖ్యంగా సిమెంట్‌తో చేసిన ఆ కొత్త ఎడం చెయ్యి అది ఆ ఊరి మనుషులంతా దేవతకి చేసిన అపచారంలా ఉంది. అందమైన నల్లరాతి విగ్రహానికి ఆ సిమెంట్ చెయ్యి అతకలేదు. అతకలేదు. అతకలేదు. వెయ్యోసారి మనసులోనే అనుకున్నాడు గవరయ్య.

కాని ఏం చెయ్యగలడు? తరాల తరబడి తన పూర్వీకులంతా ఈ దేవతనే నమ్మి కొలిచారు. ఇప్పుడు తను ఈ దేవతని విడిచిపోగలడా? పోయి ఎక్కడైనా బతకగలడా? పోనీ ఇక్కడే ఉండి ఈ అకార్యం జరగకుండా ఆపాలంటే అంత పలుకుబడీ లేదు. నిస్సహాయంగా ఉండిపోయాడు.

అయిపోయింది. నిశ్చింతగా తల్లిని కొలుచుకునే రోజులు పోయాయి. ఇక ముందు రోజూ ఈ సిమెంట్ చేతి దేవతకే ధూపదీప నైవేద్యాలూ పూజలూను. ఇష్టంలేకపోయినా అవన్నీ తనచేతిమీదుగానే జరగాలి నిట్టూర్చాడు గవరయ్య.

* * * *

అదొక చిన్న పల్లెటూరు. ఆ ఊరికంతా ప్రసిద్ధి గైరమ్మతల్లి గుడి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి నైవేద్యాలు, ఉపారాలు పెట్టిపోతూంటారు. గుడిలో గైరమ్మ బహుచక్కనిది. కాని ఎడమ చెయ్యి లేదు. ఎప్పుడో ఏ విజాతీయులో కొట్టేసి ఉంటారు. అయితే ఏం? అందువల్ల ఆవిడ ఖ్యాతికేమీ లోపం రాలేదు. భక్తులంతా విరిగిన విగ్రహాన్నే ఆరాధిస్తున్నారు. గొప్ప మహిమగల తల్లి అని, సత్యమైన దేవత అని జిల్లా జిల్లా అంతా చెప్పుకుంటారు.

ఇన్నేళ్ళుగా తల్లి పూజా పునస్కారాలు ఏ ఆటంకం లేకుండా సాగిపోతున్నాయి. ఆ మధ్య గుడివెనకే సినిమా హాలూ వెలిసిందేమో గుడికి రోజూ రద్దీ పెరిగింది. సినిమాకి బయల్దేరిన వాళ్ళంతా ఓ పది నిమిషాలు ముందే బయల్దేరి, అమ్మవార్ని దర్శించుకుని మరీ సినిమాకెళ్తున్నారు. పుణ్యం, పురుషార్థం కూడాను. సినిమాహాలు యజమాని కూడా గుడికి చిన్న చిన్న మరమ్మతులు, హంగులు చేయించి తన భక్తిని చాటుకున్నాడు.

ఈ మధ్యే ఊళ్ళో పంచాయితీ ఎన్నికలు జరిగాయి. చాలా కాలంగా ఊళ్ళో నాయక ఎన్నికలు ఉండేవి కాని ఎప్పుడూ గెలిచేది పోలీసు నాయుడే. అయితే కొన్నాళ్ళకిందటే పోలీసునాయుడు గుండెజబ్బుతో పోయాడు. అంచేత ఈసారి ఎన్నికల్లో సర్పంచి ఎవరు అనే విషయమై తర్జనభర్జనలు జరిగాయి. కాని ఎక్కువ గొడవలూ కొట్లాటలూ లేకుండానే ఊరంతా ఒక నిర్ణయానికి వచ్చేశారు. పోలీసు నాయుడి కొడుకు కొండల్నాయుడికే సర్పంచ్ పదవి ఇవ్వాలని. ఇంకా మీసాలైనా సరిగ్గా మొలవని చిన్నగుంటడు, వాడేమి సర్పంచ్ అని కొందరు పొద్దు పెట్టేరుగాని, తండ్రిపోయిన సానుభూతి కొండల్నాయుణ్ణే బాగా ఆదుకుంది బీకామ్ చదివేడు కదా టౌనుకెళ్ళి, ఆ మాత్రం చెయ్యలేడా, వెనక మనమంతాలేమా, అన్నారు పోలీసునాయుడి బలగమంతా.

కొండల్నాయుడే సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. ఎన్నికల ఫలితాలు ప్రకటించగానే మెళ్ళో దండల్తో వీధి వీధి ఊరేగి, చివరగా గైరమ్మ తల్లి గుడికి కూడా దర్శనానికి వచ్చాడు. హోదా పెరిగింది కదా, అతడి దృష్టి మారింది. పూజారి గవరయ్య అతడిపేర స్పెషల్ పూజ చేస్తూ ఉండగా కొండల్నాయుడి దృష్టి అమ్మవారి మొండి చెయ్యిమీద పడింది. "ఔను గాని అవధాని గారూ, మన అమ్మోరికి చెయ్యిలేకపోవడం మాత్రం బాగులేదండీ" అన్నాడు పక్కనున్న అవధానితో.

"ఔనౌను, మరే" అన్నాడు అవధాని.

"ఎప్పుడో ఎలాగో జరిగిందే అనుకోండి. మనం మళ్ళీ బాగు చేయించొద్దా? మనకా బాధ్యత లేదా?" అన్నాడు కొండల్నాయుడు. ఎలా ఎలా దేశ సేవ చెయ్యాలో రాజకీయాల మతలబులు అతడికప్పుడే అర్థమైపోతున్నాయి.

"ఎంతమాట? అది తమ హక్కు కూడాను. గ్రామ ప్రజలే కాదు, గ్రామదేవతల బాగోగులు చూడవలసింది కూడా ఇక మీరే. మీకు కాకపోతే ఇంకెవరికి అధికారం ఉందీ ఇలాంటి దైవకార్యాలు నిర్వహించడానికి?" అంటూ తాళం వేశాడు అవధాని.

గవరయ్య తీర్థం తెచ్చి ఇచ్చినపుడు అన్నాడు కొండల్నాయుడు "గవరయ్యగారూ, మన అమ్మోరి ఇగ్రహం బాగు చేయిద్దాం. ఏటంటారు? అలా ఒక చెయ్యి లేకుండా ఉంటే బాగులేదు"

గవరయ్యకి ఏమనడానికీ వెంటనే తోచలేదు. అమ్మవారికి చెయ్యిలేకపోవడం అతడికెప్పుడూ ఒక లోపంగా తోచలేదు. చిన్నప్పటి నుంచి అతడు అమ్మవార్ని అలా చూడడానికే అలవాటు పడ్డాడు. ఇన్నాళ్ళూ లేనిది ఇప్పుడెందుకూ ఈ మరమ్మతులు?

ఈ లోగా అవధానే అందుకున్నాడు. "గవరయ్య ఏమంటాడు? వొద్దంటాడా? అసలు మీరు చిన్నవారు మీకు తెలియదు. ఓ రహస్యం చెపుతాను వినండి. దేవతా విగ్రహాలు ఇలా అసంపూర్ణంగా, దోషభూయిష్టంగా ఉండకూడదు. వాటి సవరు పోతుంది. అలగా జనం ఏదో అలవాటు కొద్దీ దండాలు పెడుతున్నారుగానీ, అలా అవకరం ఉన్న విగ్రహానికి పూజలు చెయ్యడం ఊరికే అరిష్టం. చూడండి. కిందటేడాది వానలు సరిగ్గా కురవలేదు. ఈ ఏడు సర్పంచ్‌గారు అంటే మీ నాన్నగార్ని కొట్టేసింది......"

కొండల్నాయుడికి నిజమే అనిపించింది. రాజసంగా తల ఊపుతూ "మనదూటే మనం చేస్తే, దేవతలు అల్లదూటే అల్లు చేస్తారు. మనింట్లో మనుసులకి కాలూ చెయ్యి ఏదైనా అయితే బాగు చేయించుకోనా? గుళ్ళో ఇగ్రహాలకి మాత్రం ఎందుకు అశ్రద్ధ చెయ్యాల?"

అన్నాడు ఉదారంగా.

"అదీమాట" అని వంతపాడేడు అవధాని.

గవరయ్యకి మాత్రం ఈ ప్రతిపాదన నచ్చలేదు. అంచేత నీళ్ళు నములుతూ "ఇన్నేళ్ళుగా లేనిది ఇపుడెందుకు బాబూ? తల్లి మన్ని దయగానే చూస్తోంది కదా తల్లిమహిమ ప్రజలందరికీ తెలుసు...." అన్నాడు.

"అది నిజమేనండి గవరయ్యగారూ! కాని ఇన్నాళ్ళు అశ్రద్ధ అయిందని ఇకమీదట గూడా అశ్రద్ధ ఎందుకుగావాల? తల్లికి మరింత సేవ జేసుకుంటే తప్పేటి?"

అన్నాడు కొండల్నాయుడు.

గవరయ్య మరేమీ అనలేకపోయాడు.

"చినబాబుగారు కుర్చీ ఎక్కేరు. పనులు టకటకా జరుగుతాయి ఇక చూడండి" అన్నాడు అవధాని.

"ఈనోగారేమంటారో" అన్నాడు


"వొద్దంటాడా ఏమిటి? దైవకార్యం! అని కోప్పడ్డాడు అవధాని.

వెనకనుంచి ఎవరో అన్నారు "అలా అనేకండి బాబూ! ఈ కొత్త ఈనో సంగతి మీకు తెలీదు గాబోలు. నాస్తికపు ముండాకొడుకు. హేతువాదనో నాడిసిండాకూడు వాదనో నట..."

"నాస్తికుడైతే వాడింట్లో నాస్తికుడిగా ఉండమనండి. ఊరి గుళ్ళో పూజలు వొద్దనడానికి అతడికేం హక్కు?" అన్నాడు అవధాని కోపంగా.

కొండల్నాయుడు అతణ్ణి శాంతపరిచాడు "మీకెం

కె. గోదావరి శర్మ



దుకు వేజాముకుంటాము గదా ఈవో సంగతి" అన్నాడు అపుడే వస్తున్న మీసాల మీదకి చెయ్యి పోనిచ్చి.

ఆ విధంగా కొత్త సర్పంచ్ గారి ప్రజాసేవ కార్యక్రమాలు గైరమ్మతల్లి విగ్రహం మరమ్మత్తుతో ప్రారంభమయ్యాయి. రెండు రోజులు గుడిమూసేసి, సిమెంట్‌తో చెయ్యి తయారు చేయించి, అమ్మవారి విగ్రహానికి అతికి, నల్లరాయి రంగుతో కలిసిపోయేటట్టు ఆ చేతికి నల్ల వార్నీసు పూసేరు. దూరం నుంచి చూసే భక్తులకి చెయ్యి కలిసి పోయినట్టే కనిపించినా, దగ్గరగా చూసే గవరయ్యకి మాత్రం తేడా కొట్టొచ్చినట్టు కనిపించేది. నిర్లిప్తంగానే విగ్రహానికి సంప్రోక్షణ జరిపాడు. సర్పంచ్ గారి ఆధ్వర్యంలో కోలాహలంగా మళ్ళీ అమ్మవారికి పూజాదికాలు ప్రారంభమయ్యాయి. సామాన్య భక్తులకి వారి భక్తి విశ్వాసాలే ప్రధానం గాని విగ్రహానికి ఒక చెయ్యి ఉందా. నాలుగు చేతులున్నాయా అని వాళ్ళు పట్టించుకోరు.

* * * *

నిద్రలేక ఆలోచిస్తూ ఒత్తిగిలి పడుకున్న గవరయ్యకి చెయ్యి తిమ్మిరెక్కి బరువెక్కినట్టుగా అనిపించింది. అది అతని ఎడమ చెయ్యి. పైకెత్తలేకపోయాడు.

గవరయ్య గుండె ఝల్లుమంది. కొంపతీసి... ఒక వేళ... పక్షవాతం కాదు కదా! తల్లి శరీరానికి సిమెంట్ చెయ్యి తగిలించినందుకు శిక్షగా తనకిలా జరిగిందా? భయంతో అతడికి చెమటలు పట్టేయి. నెమ్మదిగా కుడిచేత్తో ఎడమచేతిని పట్టుకొని వేళ్ళతో ఒత్తడం ప్రారంభించాడు. ఫర్వాలేదు. స్పర్శ తెలుస్తోంది. క్రమంగా తిమ్మిరి తగ్గింది.

కానీ భయం పోలేదు. అమ్మవారి విగ్రహమే కళ్ళెదుట కనిపిస్తోంది. పైకెత్తిన దక్షిణ హస్తం బాగానే ఉంది. కిందికి చాచిన వామహస్తమే.. అది వరద హస్తం. కాని సిమెంట్ చేత్తో వరాలిస్తుందా తల్లి? మిగతా శరీరం అంతా దివ్యంగా ఉన్నట్టు, ఈ కొత్త అవయవం

ఒక్కటే అంగవికలులకి పెట్టే కృత్రిమ అవయం లాగా విజాతీయమై అమ్మవార్ని పరిహసిస్తున్నట్టు, ఆమె అవకరాన్ని ఎత్తి చూపుతున్నట్టు, అవమానిస్తున్నట్టు బాధపడిపోయాడు గవరయ్య. అతడికి ఆ రోజు ఉదయమే జరిగిన ఒక సంఘటన గుర్తుకు వచ్చింది.

ఉదయం గొల్లవీధి ఎర్రమ్మ వచ్చింది. అమ్మవారికి ఉపారం పట్టుకొని "పూజారి బాబూ, పదిరోజులై సంటోడు మూసినకన్ను ఇప్పలేదు. కిందటి మంగలోరం గైరమ్మకి ఉపారం ఎట్టుకున్నాము. ఇంతకి ముందెప్పుడూ ఇంట్లోన ఎవరికేటి ఒచ్చినా అమ్మోరికి దండం ఎట్టుకోడం, ఉపారం ఎట్టడం, ఎంటనే తగ్గిపోడం. ఈ పాలి వారం రోజులైనాది, నాబం నేకుండా ఉన్నది. ఇయాల మళ్లీ తెచ్చేను ఉపారం" అంది ఆందోళనగా. గవరయ్య మాత్రం ఏం చెప్పగలడు? "తగ్గిపోతుందిలే. భక్తిగా మనసులో ప్రార్థన చేసుకో" అని ఆమెని ఓదార్చి పంపించేశాడేగాని, అతడికే మనసులో శంక పట్టుకుంది. ఇదే కాదు, ఇంకో రెండు మూడు సంఘటనలూ ఇలాంటివే నిన్నా మొన్నా జరిగినట్టు అతడికనిపించింది. భక్తుల కోర్కెలు పూర్వంలా తీరడంలేదని, వాళ్ళంతా నిరాశతో తిరిగి వెళ్ళిపోతున్నారని అతడికనిపించింది. ఇది ఇలా కొనసాగితే అమ్మవారి పేరు ప్రతిష్ఠలకే భంగం! ఏదో ఒకటి చేసి తీరాలనే నిశ్చయానికి వచ్చాడు గవరయ్య.

* * * *

ముందొకసారి మర్నాడు మధ్యాహ్నం సర్పంచ్

గారింటికెళ్ళి కొండల్నాయుణ్ణి కలిశాడు. అమ్మవారికి కొత్తచెయ్యి పెట్టినప్పటి నుంచి మహిమ తగ్గినట్టు, అసలు మొహంలో కళ తగ్గినట్టూ తనకి అనుమానంగా ఉందని చెప్పాడు.

కొండల్నాయుడు గవరయ్య మాటల్ని కొట్టిపారేశాడు "అలాంటి లేనిపోని భ్రమలన్నీ పెట్టుకోకండి గవరయ్యగారూ! ఈ మాట నాతో అంటే అన్నారు గాని ఇంకెవ్వరి దగ్గరా అనకండి. నలుగురికీ తెలిస్తే వచ్చే నెల సంబరాల్లో మన ఆదాయం పడిపోద్ది. మీరు పూజారి అయుండి గైరమ్మకి మరింత ప్రచారం చెయ్యాలి గాని, మహిమ తగ్గిపోయిందని అనొచ్చా?" అని మందలించాడు.

హతాశుడై తిరిగొచ్చాడు గవరయ్య. ఇక తప్పదు, నిశ్చయరా తన మాట వినరు. తనే ఏదో చెయ్యాలి. తన గైరమ్మ తల్లికి పూర్వపు రూపం, పూర్వపు కళరావాలి.

ఆ సాయంకాలం వర్షం మూలంగా అమ్మవారి దర్శనానికి ఎక్కువమంది రాలేదు. మొదటి ఆట సినిమా మొదలైన తరువాత గుడి ప్రాంతం పూర్తిగా నిర్జనం అయిపోయింది. క్రమంగా గాలి వాన హెచ్చింది. సెమ్మెలో దీపం నిలవడం లేదు.

గవరయ్య మనసూ ఆ వాతావరణం లాగానే అతలాకుతలంగా ఉంది. ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తున్నకొద్దీ గుండెల్లో అలజడి, అసంతృప్తి పెరిగిపోతున్నాయి. మానె దీపపు మసక వెలుగులో వల్లరంగు పూసిన అమ్మవారి వరద హస్తం నిగనిగ మెరుస్తోంది. దాన్ని చూస్తున్నకొద్దీ అతడిలో అసహనం పెరిగిపోసాగింది.

పూనకం వచ్చినవాడిలాగా ఆవేశంతో లేచాడు. మూలనున్న కొబ్బరికాయ ఒకటి తీసుకున్నాడు. కళ్ళు మూసుకుని గైరమ్మని ప్రార్థించాడు. "తల్లీ నేను చేసేది తప్పయితే, పాపం అయితే నన్ను మన్నించు. కాని ఈ పని చెయ్యకుండా ఉండడం నా తరం కాదు" అంటూనే కొబ్బరికాయ ఎత్తి బలంకొద్దీ కొట్టేడు. దూరంగా ఎక్కడో పిడుగు పడింది. అమ్మవారి భగ్న హస్తం నారికేళ జలంతో అభిషిక్తమైంది.

* * * *

మర్నాడు ఉదయానికి గాలీవానా తగ్గాయి. గుడికొచ్చిన భక్తులందరికీ అమ్మవారి నిజరూప దర్శనం చేయించాడు గవరయ్య. కృత్రిమంగా అతికించిన చెయ్యి అమ్మవారికి నచ్చలేదని, అందుకే రాత్రికి రాత్రి అది విరిగిపోయిందనే వార్త గబగబా ఊరంతా వ్యాపించింది. జనం గుంపులు గుంపులుగా వచ్చి లెంపలు వేసుకున్నారు సర్పంచ్‌తో సహా. గైరమ్మ తల్లి పూర్వం కంటే ఇనుమడించిన మహిమలతో, పేరు ప్రఖ్యాతులతో విలసిల్లింది. ఆ తరువాత ఆ విరిగిన చేతిని బాగుచేయించే ప్రయత్నం ఇంకెవ్వరూ చెయ్యలేదు. ○



**రచయిత పరిచయం**


*శ్రీకాకుళం జిల్లా చాపర గ్రామంలో 1954లో జననం. చదువు—బి.ఎస్.సి, ఎం.ఎ (ఆంగ్ల సాహిత్యం) పి.హెచ్‌డి. ప్రస్తుతం కాకినాడ పి.జి. సెంటర్‌లో లెక్చరర్ని.*

*సాహితీ వ్యాసంగం: గోదావరి గలగలలు, ఆన్ ది బాంక్స్ ఆఫ్ ది నాగావళి—రెండు కవితా సంకలనాలు.*

*దాదాపు వంద కథలు, రెండు నవలలు, వ్యాసాలు, అనువాదాలు, పుస్తక సమీక్షలు అనేక పత్రికల్లో వచ్చాయి. పూలవంతెన (కథల సంపుటి), అంతర్వాహిని (కవితల సంపుటి) అచ్చులో ఉన్నాయి. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ ఎన్నో బహుమతులు వచ్చాయి. ప్రస్తుతం విరివిగా అనువాదాలు చేస్తున్నారు.*

—కె.గోదావరి శర్మ.

## బంద్‌లో అరటిపండు తొక్కలు



ఉదయం నుంచి మోసిన
అడుగు చప్పుళ్ళ నరాల్లో దించుకుని రోడ్డు
నిద్రపోతోంది
ఫ్యాక్టరీ పొగ గొట్టం విశ్రాంతిగా ఊపిరి
పీల్చుకుంటుంది.
వర్షమ్మ టీ కొట్టు కప్పుల శబ్దాన్ని
నిశ్శబ్దంతో పాతేసి నిద్రపోతోంది.
అద్దంలో రొట్టెమీద ఈగ నిద్రపోతుంది.
ప్రశాంతంగా నిదురోతున్న
జన జీవన గోదారి గుండెమీద
బంద్ బండై బద్దలవుతుందని తెలిసి కూడా
క్షణాల్లో పగిలే వేడిగాజు సీసా 'సూర్యీడు'
నిదురోతున్నాడు.
బందంటే
పుస్తకాల సంచీల్ని భుజానేసుకుని ఎగిరే
సీతాకోక చిలుకల దండల్ని నరికేయడం
నేలమీద మాకల్ని ఏరుకొనే
పావురాల గుంపుల్ని రాళ్లతో చెదరగొట్టడం
పార్కుల్లో ప్రేమకౌగిళ్లలో ఉద్విగ్నక్షణాల్ని
విధ్వంస పరచడం
తుమ్మెదల్ని పూల మీంచి తరిమేయడం
అవిశ్రాంతంగా కాగితాలతో పోరాటం
చేసేకలాల కలల్ని విరిచేయడం
మురికి కాకీ బట్టల మీద రక్తం చల్లడం
కడుపు కుండల్ని కర్రలతో బద్దలు కొట్టడం
మనసుకు మధుర గీతాన్ని మోసే గాలిని
గాయపరచడం
పూరి గుడిసెల హార్మోనియం మెట్లమీద
అపశృతిని పలికించడం
వ్యవస్థతిని పడేసిన ఆశేష అరటిపండు
తొక్కల్నీ
కాళ్ల కిందేసి తొక్కెయ్యడం
సతత హరితం రోడ్లమీద ప్రేతకళల
పెయింటింగ్
ఇంత తెలిసి కూడా బందంటే
భయంలేకుండా
పాపం! తూర్పు భళ్లున తెల్లారుతుంది.

— పెమ్మరాజు విజయరామచంద్ర